సాక్షి రంగారెడ్డి

శనివారం ¦ 23 ¦ ఆగస్టు ¦ 2025



పోలీసులకు సహకరించాలి

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పోలీసులకు సహకరించాలని డీసీపీ సునీతారెడ్డి కోరారు. 10లో▸



కబ్జాలను వెలికితీయాలి

రామోజీఫిల్మ్‌సిటీ కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెలికి తీసి, పేదలకు పంచాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. 10లో▸



కాలుష్య కారక పరిశ్రమను..

కాలుష్యానికి కారణమైన కుందనా పరిశ్రమను వెంటనే మూసివేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. 10లో▸

సర్వేయర్ల కొరత!

రెండుమూడు మండలాలకు ఒక్కరే..

- అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- ముందుకు సాగని భూముల కొలతలు
- లైసెన్స్‌డ్ సర్వేయర్లతోనైనా సమస్యలు తీరేనా?



భూములు కొలుస్తున్న సర్వేయర్లు (ఫైల్)

కొందుర్గు: రోజురోజుకూ భూముల విలువలు పెరగడం.. క్రయవిక్రయాలు అధికం కావడంతో భూముల కొలతలు నిర్వహించడం తప్పనిసరిగా మారింది. చాలాకాలం క్రితం కొలవడంతో వ్యవసాయ భూములకు హద్దురాళ్లు లేకుండా పోయాయి. రైతులు ఒకరి భూముల్లో మరొకరు కబ్జాలో ఉండడం పరిపాటిగా మారింది. తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో గొడవలు లేకుండా భూములను కొలతలు చేయించుకొని హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. కానీ సర్వేయర్లు లేకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఒక్కో మండలానికి ఒక సర్వేయర్ ఉండాల్సి ఉండగా కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ సర్వేయర్లు సరిపడా లేకపోవడంతో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు.

ఆరు మండలాలకు ముగ్గురే..

షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాలకు సంబంధించి ముగ్గురే సర్వేయర్లు ఉన్నారు. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాల చొప్పున బాధ్యతలు అప్పగించారు. చేవెళ్ల డివిజన్ షాబాద్‌తో పాటు మహేశ్వరం, గండిపేట మండలాల బాధ్యతలు సైతం షాద్‌నగర్ డివిజన్‌లో పనిచేస్తున్న సర్వేయర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. భూముల కొతలకు సంబంధించి దరఖాస్తులు కార్యాలయాల్లో పేరుకుపోతున్నాయి.

నాలుగు నెలలుగా ఆగిన సర్వేపనులు

ప్రభుత్వం భూ భారతి పోర్టల్ అందుబాటులోకి తేవడం.. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడంతో సర్వే పనులు పెండింగ్‌లో పడ్డాయి. భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. దీంతో ఈ మండలంలో మే నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో సర్వేయర్ పాల్గొనాల్సి వచ్చింది. జూన్ 3వ తేదీ నుంచి రాష్ట్రమంతా సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొందుర్గు సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సర్వేయర్ ఆంజనేయులు ఇన్‌చార్జి మండలాలైన జిల్లేడ్ చౌదరిగూడ, షాబాద్ మండలాల్లో జూన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హాజరయ్యారు. ఆ వెంటనే లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ ఉండటంతో జూలై 29 నుంచి సెప్టెంబర్ 25 వరకు శిక్షణలో పాల్గొంటున్నారు. ప్రస్తుతం కొందుర్గు మండలానికి 9 మంది, జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను క్షేత్రస్థాయి శిక్షణ కోసం నియమించారు. వారు ఈనెల 7న ఆయా మండలాల్లో క్షేత్రస్థాయి శిక్షణ కోసం విధుల్లో చేరారు. ప్రస్తుతం వారికి సర్వేయర్ ఆంజనేయులు 40 రోజుల పాటు క్షేత్రస్థాయి శిక్షణ అందిస్తున్నారు. దీంతో భూముల కొలతల్లో జాప్యం జరుగుతోంది.

మండలానికి ఒకరుంటే మేలు



అన్ని గ్రామాల్లో రైతుల పొలాలకు సంబంధించి హద్దురాళ్ల ఆచూకీ కనిపించకుండా పోయాయి. రైతుల మధ్య గొడవలు తప్పడం లేదు. ఒక్కో సర్వేయర్‌కు రెండు మూడు మండలాలు అప్పగిస్తే సర్వే పనులు ఎలా ముందుకు సాగుతాయి. మండలానికి ఒకరుంటే దరఖాస్తులు పెండింగ్‌లో ఉండవు.

– ప్రేమ్‌కుమార్, చెర్కుపల్లి

ప్రభుత్వ భూములను గుర్తించాలి



లైసెన్స్‌డ్ సర్వేయర్లకు క్షేత్రస్థాయి శిక్షణ ఇవ్వడం సంతోషకరమైన విషయం. వీరి శిక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటుచేయాలి. సర్కారు భూములు బయటకొస్తాయి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి.

– శెట్టి వజ్రలింగం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కొందుర్గు

ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకధాటి వర్షాలు.. భారీ వరదల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు సోమవారం నుంచి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య నిర్వహణ పనులు, దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రతి రోజూ కాలనీలు/బస్తీల్లో ఫాగింగ్ చేయడంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. క్లోరినేషన్ తర్వాతే తాగునీటిని సరఫరా చేయాలని, పైపులైన్లకు లీకేజీలు లేకుండా, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించాలని, ఈ నెలాఖరులోగా వనమహోత్సవాన్ని పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సంబంధిత అధికారులు ల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు సిద్ధంకండి

ఇబ్రహీంపట్నం రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం గణేశ్ ఉత్సవాలపై డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నిమజ్జనం కోసం జిల్లాలో 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. శోభాయాత్ర నిర్వహించే రూట్లలో రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయాలన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో క్రేన్లు, బారికేడ్లు, వేదికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, మెడికల్, శానిటేషన్ కంట్రోలింగ్ రూం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, మాదాపూర్ అడిషనల్ డీసీపీ సాయిరామ్, ఆర్డీఓలు అనంతరెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్‌రెడ్డి, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ



ఆమనగల్లు: జిల్లాలో పలువురు తహసీల్దార్‌లను బదిలీచేస్తూ శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు తహసీల్దార్‌లను నియమించారు. కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహ్మద్ ఫయిం ఖాద్రిని ఆమనగల్లు తహసీల్దార్‌గా, కొందుర్గు తహసీల్దార్‌గా పనిచేస్తున్న రమేశ్‌ను తలకొండపల్లి తహసీల్దార్‌గా నియమించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగయ్యను ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌గా, నందిగామ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేశ్వర్‌ను కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా, మహేశ్వరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న సైదులును నందిగామ తహసీల్దార్‌గా బదిలీచేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న చిన్న అప్పలనాయుడును మహేశ్వరం తహసీల్దార్‌గా కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న రాజేందర్‌రెడ్డిని కొందుర్గు తహసీల్దార్‌గా, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌గా ఉన్న పార్థసారధిని కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యూరియా కొరత లేకుండా చూడండి

మంత్రి తుమ్మలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వినతి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావుకు విన్నవించారు. శుక్రవారం మంత్రిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయానికి సరిపడా యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లేడుచౌదరిగూడ మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



ఖానాపూర్‌లో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రాంచందర్‌రావు తదితరులు

మహిళలకు కేంద్రం పెద్దపీట

- రాష్ట్రంలో హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

చేవెళ్ల: మహిళలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే విధంగా చట్టంగా మార్చి అమలు చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. మండలంలో ప్రారంభించిన పల్లెపల్లెకూ బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఖానాపూర్‌లో దళిత రైతు ఇంట్లో బస చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలోని రైతులు రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పంట పొలాలను పరిశీలించి వారితో మాట్లాడారు. అక్కడి నుంచి ఆలూరులో మహిళా సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే నారీశక్తిని ఆర్థికశక్తిగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా మహిళలు వ్యాపారం చేసుకునేందుకు రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు తక్కువ వడ్డీకే రుణాలు అందించి చేయూత అందిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించి ఓ పార్టీ మోసం చేస్తే 19 నెలలే పాలించిన ఈ ప్రభుత్వం మరింత నాశనం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రేవంత్‌సర్కార్ ప్రజలను మోసం చేస్తోందని ఎన్నికల్లో గెలిస్తే తులంబంగారం ఇస్తామని ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇళ్లు, రైతు బంధు, రుణమాఫీ ఇవ్వలేదన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించి మార్పు చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా కార్యదర్శి జి. వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో వ్యాపారుల బైక్ ర్యాలీ

❖ బంద్ ప్రశాంతం

మార్వాడీ గో బ్యాక్ అంటూ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. వర్తకసంఘం, వస్త్ర, కిరాణా, స్వర్ణకార సంఘం, ఇతర వాణిజ్య సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. మార్వాడీలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. మార్వాడీ వద్దు లోకల్ ముద్దు, మన ప్రాంతం మన వ్యాపారం, మార్వాడీకో హటావో.. తెలంగాణకో బచావో, సేవ్ తెలంగాణ అంటూ నినదించారు.



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వర్తక, వ్యాపార సంఘం నాయకులు



ఆమనగల్లు: పట్టణంలో మూసి ఉంచిన దుకాణాలు

సారు.. ఇదేం తీరు!

- విద్యాబుద్ధులు నేర్పే గురువులే తప్పటడుగులు
- మొన్న వెంకటాపూర్‌లో విద్యార్థినితో అసభ్య ప్రవర్తన
- తాజాగా హిమాయత్‌నగర్‌లో మద్యం తాగి విధులకు..

మొయినాబాద్: విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే తప్పటడుగులు వేస్తున్నారు. నవ సమాజాన్ని నిర్మించాల్సిన ఉపాధ్యాయులు వృత్తికే కళంకం తెస్తున్నారు. మొన్న వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడమేకాకుండా ప్రశ్నించిన విద్యార్థిని తండ్రిని బూతులు తిట్టి చెప్పుతో దాడికి యత్నించాడు. ఈ సంఘటన మరవక ముందే హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు మద్యం తాగి వచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది.

మద్యం మత్తులో బడికి..

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ హిమాన్షహ కొన్ని రోజులుగా మద్యం తాగి పాఠశాలకు వస్తున్నాడు. మద్యం మత్తులో పాఠాలు చెప్పకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాడు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో గురువారం కొంత మంది పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని మందలించారు. శుక్రవారం గ్రామ పెద్దలతోపాటు ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులను పిలిపించి విషయాన్ని వివరించారు. తీరు మార్చుకోవాలని.. లేదంటే జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి మల్లయ్య పాఠశాలకు వెళ్లి వివరాలు ఆరాతీశారు. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

సర్వత్రా విమర్శలు

మొయినాబాద్ మండలం వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 రోజుల క్రితం హిందీ పండిత్ ప్రవీణ్‌కుమార్ పదో తరగతి విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె తండ్రి పాఠశాలకు వెళ్లి అడిగాడు. దీంతో రెచ్చిపోయిన సదరు ఉపాధ్యాయుడు బూతులు తిడుతూ చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. తోటి ఉపాధ్యాయులు వారించినా వినలేదు. ఈ ఘటనపై ఎంఈఓ మల్లయ్య జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. అయినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. షీటీం పోలీసులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వారిని విధుల నుంచి తొలగించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



హిమాయత్‌నగర్‌లో ఉపాధ్యాయుడు, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఈఓ

న్యూస్‌రీల్

చేపల పెంపకం కేంద్రాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి



కందుకూరు: కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి ఎస్పీసింగ్ బఘేల్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద డిక్కీ (దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) నేషనల్ ప్రెసిడెంట్ నర్రా రవి కుమార్ ఏర్పాటు చేసిన చేపల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. చేపల పెంపకం తీరు, దిగుబడి, ఖర్చులు, ఎగుమతి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా నాయకుడు పల్లె కృష్ణగౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం సాగిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులు సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. సమస్యల సాధనకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కువద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీదర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి బీవీ ఎం.రాజు, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, సురేష్‌సింగ్, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పీఎస్ పరిధిలోని మీరాఖాన్‌పేటలో శుక్రవారం మండపాల నిర్వాహకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు ముందే పోలీసులకు సమాచారం అందించాలని, నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. డీజేలు పెట్టొద్దని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నవరాత్రుల అనంతరం ఏ ప్రాంతాల్లో నిమజ్జనం చేస్తున్నారో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు సైదులు, వంశీ పాల్గొన్నారు.

సేవలను గుర్తించి.. పురస్కారం అందించి



షాద్‌నగర్‌రూరల్: విధుల్లో నిబద్ధతను కనబరిచిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) వెంకటేశ్వర్లుకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ బంగారు పతకం, నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులను సత్కరించారు. ఈ సందర్భంగా డీఐ వెంకటేశ్వర్లు సీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా బంగారు పతకం, నగదు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ.. బంగారు పతకాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, శంషాబాద్ డీసీపీ రాజేష్, ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవాలు



షాద్‌నగర్: అంబులెన్స్‌లో చికిత్స అందిస్తున్న సిబ్బంది



మొయినాబాద్: కుటుంబ సభ్యులకు శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

తల్లీబిడ్డలు క్షేమం

షాద్‌నగర్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఇద్దరు గర్భిణులకు 108 సిబ్బంది పురుడు పోశారు. వివరాలు.. షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు చెందిన తుల్జాబాయికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆమెను షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు నెలలు నిండలేదని, బీపీ ఎక్కువగా ఉందని, ప్రసూతి చేసేందుకు ఇబ్బంది అవుతుందని వెంటనే హైదరాబాద్‌లోని పేట్లబుర్జు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. 108 వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో సిబ్బంది రాంచంద్రయ్య, మహబూబ్ ఆమెకు పురుడు పోశారు. తుల్జాబాయి పండంటి ఆడ బిడ్డకు జన్మించిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నీలోఫర్‌కు తరలిస్తుండగా..

మొయినాబాద్: పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మౌనిక డెలివరీ కోసం గురువారం రాత్రి మొయినాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటంతో సిబ్బంది ఆమెను పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో 108 వాహనంలో నగరంలోని నీలోఫర్ ఆసుపత్రికి తరలిస్తుండగా పురుటి నొప్పులు ఎక్కువ అవడంతో సిబ్బంది ప్రసవం చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు.

ఫిల్మ్‌సిటీ కబ్జాలను వెలికితీయాలి

- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను తొలగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



కలెక్టర్‌ను కలిసి వస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీఫిల్మ్‌సిటీ యాజమాన్యం కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెలికి తీసి ప్రజలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిల్మ్‌సిటీ యాజమాన్యం వేముల కత్వా, ఇందిరా సాగర్, పటేల్ కుంటల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించి భారీ ప్రహరీలను నిర్మించిందని తెలిపారు. ఫిల్మ్ సిటీ మెయిన్‌గేటు వద్ద బఫర్‌జోన్‌లో నిర్మాణం చేపట్టారని, ఇందిరా సాగర్‌ను పూర్తిగా ఆక్రమించారని ఆరోపించారు. ఫిల్మ్‌సిటీ యాజమాన్యం అక్రమణలకు అడ్డులేకుండా పోయిందని మండిపడ్డారు. సర్వే నంబర్ 307లో 60 ఎకరాలకు పైగా భూమి ఉందని, అందులో 20 ఎకరాలు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ పేరున ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. 301 సర్వే నంబర్‌లో ఆరు ఎకరాలు అనాజ్‌పూర్ ఎస్సీ రైతులకు పట్టాలు ఇచ్చారని, ఆ భూమి ఫిల్మ్‌సిటీ లోపల ఉండడంతో రైతులు రాకపోకలు సాగించకుండా కోర్టు ఆర్డర్ అడ్డం పెట్టుకొని ఫిల్మ్‌సిటీ ఆధీనంలో పెట్టుకుందని విమర్శించారు. సర్వే నంబర్ 251లో పది ఎకరాలు ఆక్రమించారని, ప్రభుత్వం వెంటనే సర్వే చేసి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని వెలికితీసి భూమిలేని పేదలకు పంచాలన్నారు. కలెక్టర్ స్పందించి సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహ, మహేశ్, బాలరాజ్, కావలి రాములు, మల్లయ్య, రవి, వెంకటేష్, బాల్‌రాజ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు

తల్లి దశదినకర్మ రోజే..

కుమారుడి మృతి



వెంకటేష్ చారి(ఫైల్)

మొయినాబాద్: తల్లి దినవారం రోజే కుమారుడు మృతి చెందిన ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లికి చెందిన కమ్మరి వెంకటేశ్ చారి(50) తల్లి పది రోజుల క్రితం మృతి చెందడంతో గురువారం దినవారం(దశదిన కర్మ) కార్యక్రమాలు ముగించారు. రాత్రి లంగర్‌హౌస్ వద్ద ఉన్న సంగెం ఆలయంలో నిద్ర చేసేందుకు తన కుమారుడు విశాల్ చారితో కలిసి బైక్‌పై బయలుదేరారు. రాత్రి 10.50 గంటల సమయంలో పట్టణ సమీపంలోని తాజ్ హోటల్ వద్దకు రాగానే వీరి బైక్‌ను క్రేన్ ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను భాస్కర ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్‌చారి మృతి చెందినట్లు నిర్ధారించారు. విశాల్ చారి చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కాలుష్య కారక పరిశ్రమను మూసేయండి



సీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న అల్లి దేవేందర్, చందనవెల్లి గ్రామస్తులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: కాలుష్యానికి కారణమైన కుందనా పరిశ్రమను వెంటనే మూసివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని చందనవెల్లి రెవెన్యూలో కొనసాగుతున్న కుందానా కంపెనీ ఎదుట గ్రామస్తులతో ఆందోళన చేపట్టారు. అనంతరం కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ నుంచి రసాయనాలతో కూడిన పొల్యూషన్ వల్ల ఎన్నో పశువులు మృత్యువాత పడ్డాయని ఆరోపించారు. రసాయనాలు పంట పొలాల్లోకి వెళ్లి పంటలు దెబ్బతింటున్నాయని చెప్పారు. పొల్యూషన్ కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు వాంతులు, విరోచనాలు చేసుకుంటున్నారని వాపోయారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిశ్రమల శాఖ పరిశ్రమను పరిశీలించి సీజ్ చేయాలన్నారు. లేదంటే కంపెనీ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు భీమయ్య, అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, యాదయ్య, గ్రామస్తులు, తదితరులున్నారు.

నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

తుర్కయంజాల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి కోరారు. శుక్రవారం ఆదిబట్ల ఠాణా పరిధి తుర్కయంజాల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. విగ్రహాల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ఈ ఏడాది ఇప్పటికే తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వర్షాలు నేపథ్యంలో తేమ కారణంగా మూడు ఫీట్ల దూరంలో ఉన్నప్పటికీ విద్యుత్ తీగల నుంచి ప్రమాదం పొంచి ఉంటుందని సూచించారు. ప్రభుత్వం 11 రోజుల పాటు మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ కొందరు విద్యుత్ శాఖ వారిని సంప్రదించకుండా నిర్లక్ష్యంగా తీగలకు కొండీలను తగిలిస్తున్నారని ఇది సరికాదన్నారు. ఐఎస్ఐ మార్క్‌తో పాటు ఎంసీబీని కొనుగోలు చేసి సమాచారం ఇస్తే విద్యుత్ శాఖ సిబ్బంది లీగల్‌గా కనెక్షన్‌ను ఇస్తారని చెప్పారు. వినాయకుడి వద్ద ఉంచే దీపం విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్వేషాలకు, వివాదాలకు తావివ్వకుండా పండుగను నిర్వహించుకోవాలని, ముందు తరాలకు ఆదర్శంగా ఉండేలా నిర్వాహకులు మెలగాలని కోరారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీపీ రాజు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ప్రశాంతంగా ముగిసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ రవి కుమార్, మున్సిపల్ డీఈ భిక్షపతి, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై దాడి

నిర్వాహకుడికి రిమాండ్

మొయినాబాద్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్ఓటీ, స్థానిక పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకమామిడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కనకమామిడి గ్రామంలో ఉన్న కృష్ణారెడ్డి ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఫాంహౌస్‌లో ఉన్న నలుగురు వ్యక్తులతో పాటు ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కనకమామిడికి చెందిన యెల్లా శ్రీనివాస్ అలియాస్ బోండల శ్రీను గ్రామంలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ.. సులభంగా డబ్బు సంపాదించాలని పేద అమ్మాయిలకు డబ్బు ఆశ చూపి వారితో వ్యభిచారం చేయిస్తున్నాడని తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు. శ్రీను గతంలోనూ ఇదే తరహా కేసులో జైలుకు వెళ్లివచ్చినట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన విద్యార్థి కుటుంబ సభ్యుల చెంతకు



యాచారం ఠాణాలో విద్యార్థి మనిచరణ్

యాచారం: తప్పిపోయిన విద్యార్థిని యాచారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు... కందుకూరు మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన మనిచరణ్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థి శుక్రవారం ఉదయం యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్నాడు. గమనించిన యాచారం పోలీసులు ప్రశ్నించగా సరిగా వివరాలు చెప్పలేదు. వసతి గృహంలో చదువుకుంటున్నానని చెప్పడంతో వసతి గృహం ఇన్‌చార్జితో పాటు తల్లితండ్రులకు సమాచారం అందించారు. నిర్ధారణ చేసుకున్నాక విద్యార్థి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఏసీబీకి చిక్కిన వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్

వనస్థలిపురం: వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రూ.70 వేలు లంచం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తుర్కయాంజాల్ పరిధిలోని 200 గజాల స్థల విషయం వివాదాస్పదంగా మారింది. దీని రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్ రూ.లక్ష డిమాండ్ చేయడంతో బాధితుడు రూ.70 వేలు ఇస్తానన్నాడు. ఈ మేరకు శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ తన సహాయకుడు, డాక్యుమెంట్ రైటర్ వద్ద టైపిస్ట్‌గా పని చేసే రమేష్ ద్వారా రూ.70 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. కార్యాలయంలో జరిగే అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరయ్య(26), శ్రావణిలు బుద్వేల్ ప్రాంతంలో నివాసముంటున్నారు. బీరయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. శుక్రవారం ఇంట్లో భార్య శ్రావణి వంట చేస్తుండగా గ్యాస్ అయిపోయింది. దీంతో బీరయ్య ఇదే ప్రాంతంలో ఉంటున్న అత్తగారింటికి వెళ్లి అన్నం అక్కడే వండుకొని రమ్మని భార్యకు తెలిపాడు. దీంతో భార్య తల్లిగారింటికి వెళ్లింది. అనంతరం బీరయ్య ఇంట్లో దూలానికి నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. భోజనానికి వస్తానని చెప్పిన భర్త ఇంకా రాకపోవడంతో శ్రావణి ఇంటి వద్దకు వచ్చి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. ఎంతకూ తెరవకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన పట్నం ఠాణా పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. చర్లపటేల్ గూడ మహాత్మాజ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న బాలిక మధ్యాహ్నం భవనం పై నుంచి దూకింది. చెట్టుపై పడటంతో ప్రాణాపాయం తప్పింది. చిన్నారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. గద్వాలకు చెందిన విద్యార్థిని ఈ నెల మొదటి వారంలో గురుకులం చేరినట్లు తెలుస్తోంది. హోంసిక్ కారణంగానే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. కళాశాల సిబ్బంది, అధికారులు ప్రమాద విషయాన్ని గోప్యంగా ఉంచడం గమనార్హం.

నిషేధిత పొగాకు పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: నిషేధిత పొగాకు విక్రయాలపై ఎస్ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. భారీ ఎత్తున పొగాకు, గుట్కా నిల్వలను సీజ్ చేశారు. ఈ ఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మాతాజీ కిరాణం జనరల్ స్టోర్‌లో అక్రమంగా నిషేధిత గుట్కా విక్రయిస్తున్నారనే సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. నిషేధిత పాన్‌మసాల నిల్వలను సీజ్ చేశారు. బొల్లారం కుమావత్, రాజ్‌కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కిశోర్ తెలిపిన ప్రకారం.. బుద్వేల్ శివసాయినగర్ ప్రాంతానికి చెందిన భవిత ఠాకూర్ సింగ్ (36), కృష్ణ సింగ్ దంపతులు. భవిత ఠాకూర్ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త కృష్ణసింగ్ బంధు, మిత్రులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మజీద్‌పూర్ స్కూల్‌ను సందర్శించిన గుజరాత్ బృందం



పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులతో గుజరాత్ విద్యాధికారుల బృందం సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను గుజరాత్ విద్యాశాఖాధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 80 మంది విద్యాధికారులు ప్రత్యేక పర్యటనలో భాగంగా సందర్శించి తెలంగాణ విద్యా రంగంలో చేసిన మార్పులను తెలుసుకున్నారు. మన తెలంగాణ సంప్రదాయ బతుకమ్మ పాటతో అమ్మఆదర్శ కమిటీ సభ్యులు అలరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.సుశీందర్‌రావు, స్టేట్ సీఎంవో కె.జోసెఫ్, ఏఎంవో జయచంద్రారెడ్డి, రంగారెడ్డి సీఎంవో వెంకటేశ్వర్లు, ఎంఈవో జగదీశ్వర్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రమేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మహేశ్ పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వినియోగించుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాడ్గుల: పేద, మధ్య తరగతి మహిళలు, నిరుద్యోగ యువతను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని ఉన్నతాధికారి డాక్టర్ ముత్తు కుమారస్వామి, హెచ్‌ఆర్ ఖన్నా అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశు సంవర్ధక శాఖను వారు సందర్శించి మాట్లాడారు. పశు సంతతిపై మార్కెట్లో దుష్ప్రచారం పెరగడం వలన ఎన్ఎల్ఎమ్ పథకంపై ఎవరూ ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. ఈ పథకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఇర్విన్ గ్రామంలో ఎన్ఎల్ఎమ్ స్కీమ్‌తో మంజూరైన షీప్ ఫార్మ్‌ను వారు పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. రాష్ట్ర పశు సంవర్ధక అధికారులు మధుసూదన్, శ్రీనివాస్‌రావు, వెంకటయ్యగౌడ్, డాక్టర్ శంకర్ యాదవ్ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందిస్తున్న పోలీసులు

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి జనవరిలో హైదరాబాద్‌లోని ఆరంఘర్ నుంచి నిర్దవెల్లికి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తులు కృష్ణారెడ్డికి సంబంధించిన బ్యాంకు ఖాతా నుంచి 1.45లక్షలను ట్రాన్స్‌ఫర్ చేసుకోవడంతో బాధితుడు 1930కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన కేశంపేట పోలీసులు నిందితుల బ్యాంక్ ఖాతాలోని రూ.87 వేలను కోర్టు ఆదేశాల మేరకు కృష్ణారెడ్డి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ లభ్యం అవడంతో శుక్రవారం సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ బాధితుడు కృష్ణారెడ్డికి అందజేశారు.

కొత్త కార్డులకు రేషన్

సెప్టెంబర్ కోటా విడుదల

- 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీ
- కొత్తగా లక్ష కుటుంబాలకు లబ్ధి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త ఆహార భద్రత (రేషన్)కార్డుదారులకు శుభవార్త. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు అందనున్నాయి. పాత కార్డుదారులతో పాటు కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన కుటుంబాలకు కూడా నెలవారీ రేషన్ కోటా విడుదలైంది. పౌరసరఫరాల గోదాంల నుంచి ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు ఇండెంట్ ప్రకారం బియ్యం స్టాక్ సరఫరా ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి సుమారు లక్షకు పైగా కొత్త కార్డుదారులకు బియ్యం అందనున్నాయి. పౌరసరఫరాల శాఖ గత ఐదు నెలల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ వస్తోంది. ఈ నెల 20 వరకు మంజూరైన కార్డుదారులకు సెప్టెంబర్ కోటా కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాత కార్డుదారులకు జూన్ నెలలోనే ఒకేసారి మూడు నెలల కోటా కింద రేషన్ బియ్యం పంపిణీ జరిగింది. అయితే.. మే 20 వరకు మంజూరైన కొత్త కార్డుదారులకు కూడా మూడు నెలల కోటా ఒకేసారి అందజేశారు. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డు మంజూరు ప్రక్రియ కొనసాగుతున్నా... రేషన్ కోటా మాత్రం కేటాయించలేదు. మూడు నెలల కోటా గడువు ముగియడంతో తాజాగా పాత కార్డుదారులతో పాటు కొత్తవారికి కూడా సెప్టెంబర్ కోటా కేటాయించారు.

గ్రేటర్‌లో 13.76 లక్షలపైగా కార్డులు

గ్రేటర్ పరిధిలో సుమారు 13.76 లక్షల కార్డులు ఉండగా, అందులో దాదాపు 60.01 లక్షల యూనిట్లు (లబ్ధిదారులు) ఉన్నారు. ప్రతి కార్డులోని యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం కోటా కేటాయించారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా వచ్చే నెల 1 నుంచి 15 వరకు నెలవారీ కోటా పంపిణీ చేస్తారు. లబ్ధి కుటుంబాలు సెలవులు మినహా మిగతా రోజుల్లో నెలవారీ కోటాను డ్రా చేసుకోవచ్చు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని సభ్యులు(కార్డులో పేరు ఉన్న సభ్యులు) ఒకరు ప్రభుత్వ చౌక ధరల దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ఇచ్చి కుటుంబానికి కేటాయించిన సరుకుల కోటాను డ్రా చేయవచ్చు. సన్న బియ్యం మాత్రమే ఉచితంగా పంపిణీ చేస్తారు. మిగతా సరుకులు సబ్సిడీపై కొనుగోలు చేయాల్సి ఉంది.

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు ఇలా

అర్బన్ ఏరియా	కార్డుల సంఖ్య	యూనిట్లు
హైదరాబాద్	7,12,952	26,88,567
మేడ్చల్–మల్కాజిగిరి	4,21,400	14,68,82
రంగారెడ్డి	2,19,316	763,585
సంగారెడ్డి	23,091	80,963

పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం

- 'పనుల జాతర'కు స్పందన కరువు
- కార్యక్రమంపై ప్రజలకు సమాచారం ఇవ్వని సెక్రటరీ



పాపిరెడ్డిగూడ గ్రామసభ

కేశంపేట: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉద్యోగులు తమ విధులను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంలో వారిదే ప్రముఖ పాత్ర. పాపిరెడ్డిగూడ పంచాయతీ కార్యదర్శి పనితీరు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అన్ని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు ప్రారంభించి అనంతరం గ్రామసభ నిర్వహించాలని మండలాధికారులు సూచించారు. ఈ గ్రామసభలకు గ్రామ ప్రత్యేక అధికారులతో పాటుగా మాజీ ప్రజాప్రతినిధులను, గ్రామస్తులను ఆహ్వానించాలని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనుల కోసం దరఖాస్తులను స్వీకరించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి, లబ్ధి తదితర విషయాలను వివరించాలన్నారు. పాపిరెడ్డిగూడ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండానే గ్రామసభను ఏర్పాటుచేశాడు. ప్రజలు అందుబాటులో లేక రోడ్డు పైన వెళ్తున్న వారిని నలుగురిని తీసుకువచ్చి గ్రామసభను నిర్వహించాడు. గ్రామస్తులకు ముందస్తు సమాచారం అందించకపోవడంతో గ్రామంలో పనుల జాతర కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది.